క్లుప్తంగా

సక్రమంగా పారిశుద్ధ్యం నిర్వహించండి



పారిశుద్ధ్య పనులు చేయిస్తున్న చైర్మన్ గఫార్

కనిగిరి రూరల్: పారిశుద్ధ్యం విషయంలో ప్రజలు ఇచ్చే ఫిర్యాదులపై తక్షణం స్పందించి చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ అన్నారు. సమస్య పరిష్కార కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ఆర్టీసీ డిపో ఏరియాలో ప్రజా ఫిర్యాదు మేరకు శుక్రవారం పర్యటించారు. ఆయన మాట్లాడుతూ డిపో ప్రాంతంలో, రోడ్డుపై చెత్తా చెదారం, వ్యర్థాలు తొలగించక పోవడంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏఎంసీ మాజీ డైరక్టర్ బొట్టు శ్రీను, బేరి భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాలువ ఏర్పాటు చేయాలి



నేషనల్ హైవే డీఈకి సమస్యలు వివరిస్తున్న షేక్ బుజ్జి, గ్రామ నాయకులు

సీఎస్‌పురం (పామూరు): కోవిలంపాడు చెరువుకు వర్షపునీరు వెళ్లేందుకు ప్రత్యేక కాలువ ఏర్పాటు చేయాలని కోవిలంపాడు సర్పంచ్ షేక్ ఖాదర్‌బీ బుజ్జి, వైఎస్సార్ సీపీ మైనారిటీ సెల్ రాష్ట్ర కార్యదర్శి షేక్ బుజ్జి హైవే డీఈ అనిల్‌కుమార్‌రెడ్డిని కోరారు. కోవిలంపాడు వద్ద గ్రామ చెరువుకు నీరు వెళ్లేందుకు జాతీయ రహదారి 167బి దగ్గర ప్రత్యేక కాలువ ఏర్పాటు చేసే విషయమై శుక్రవారం హైవే డీఈ అనిల్‌కుమార్ రెడ్డి సర్పంచ్, నాయకులతో చర్చించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తానని డీఈ హామీ ఇచ్చారని వారు తెలిపారు.

కట్టెల ట్రాక్టర్ ఢీకొని దంపతులకు గాయాలు

టంగుటూరు: కట్టెల లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను కారు ఢీకొనడంతో దంపతులకు స్వల్ప గాయాలవగా, కారు ముందు భాగం దెబ్బతింది. ఈ సంఘటన టంగుటూరు మండలం కందులూరు సమీపంలో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. బాధితుల బంధువుల తెలిపిన వివరాల మేరకు.. టంగుటూరు మండలం పొందూరు గ్రామానికి చెందిన ముప్పరాజు సురేష్, భార్య క్రాంతి ఒంగోలుకు వ్యక్తిగత పనులపై వెళ్లి వస్తున్నారు. ఈ క్రమంలో కందులూరు గ్రామ శివారున కట్టెల లోడుతో ఉన్న ట్రాక్టర్ రోడ్డుపై నిర్లక్ష్యంగా నిలిపి ఉంచారు. ఈ క్రమంలో చీకటిలో ట్రాక్టర్ కనిపించక కారు ఢీకొట్టింది. సురేష్ తలకు, ఆయన భార్య కాళ్లకు గాయాలయ్యాయి. స్థానికులు స్పందించి 108లో ఒంగోలులోని ఓ ఆసుపత్రికి తరలించారు.

లిఫ్ట్ ఇరిగేషన్ ట్రాన్స్‌ఫార్మర్ల అపహరణ

టంగుటూరు: లిఫ్ట్ ఇరిగేషన్ కోసం వినియోగించే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తుతెలియని దుండగులు అపహరించారు. ఈ సంఘటన టంగుటూరు మండలం పొందూరు గ్రామంలో చోటు చేసుకోగా.. రైతులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. రైతులు తెలిపిన వివరాల మేరకు.. పొందూరు గ్రామంలోని వెంకటేశ్వర అభ్యుదయ ఎత్తిపోతల పథకం, పొందూరు 1 టు 9/16 ఎత్తిపోతల పథకాలకు 240 కిలోవాట్స్, 100 కిలోవాట్స్ విద్యుత్ పరివర్తకాలను ఏళ్ల క్రితం ఏర్పాటు చేసుకున్నారు. ఈ ఎత్తిపోతల పథకం కింద 16 వందల ఎకరాల భూమి సాగు చేస్తుంటారు. ఇటీవల గుర్తుతెలియని వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి అందులోని రాగి తీగను అపహరించడాన్ని ఆలస్యంగా గమనించిన రైతులు శుక్రవారం పోలీసులను ఆశ్రయించారు. సీఐ హజరతయ్యకు ఫిర్యాదు చేయడగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

వివాహ వేడుకలో దద్దాల



వివాహ వేడుకలో దద్దాల నారాయణ యాదవ్

కనిగిరి రూరల్: మండలంలోని బుడ్డాయపల్లిలో శుక్రవారం రాత్రి జరిగిన మద్దిరాల వారి వివాహ వేడుకలో వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ పాల్గొన్నారు. నూతన వధూవరులకు వివాహ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, జమ్మల మడక సర్పంచ్‌లు పాశం కొండయ్య, గంగవరపు నాగిరెడ్డి, కటికల వెంకటరత్నం, స్వర్ణ ఏడుకొండలు రెడ్డి, ఎం. శ్రీహరిరెడ్డి, నాగార్జున, తిరుపతిరెడ్డి, రోశయ్య, దయానందం, నాగార్జున రెడ్డి, వార్డు సభ్యుడు కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు



పామూరు: విశిష్ట అలంకరణలో మహాలక్ష్మీ అమ్మవారు



పామూరు: విశిష్ట అలంకరణలో వాసవీమాత మూల విగ్రహమూర్తి



సీఎస్‌పురంలో విశిష్ట అలంకారంలో రాచూరి పెద్దమ్మ మూల విగ్రహమూర్తి



కనిగిరి: సాయిబాబా దేవస్థానంలో వరలక్ష్మీ వ్రత పూజలు



ప్రత్యేక అలంకరణలో వల్లూరమ్మతల్లి



మోట్రావులపాడులో గోపూజ నిర్వహిస్తున్న భక్తులు



కనిగిరిలోని ఆలయాల్లో..

పామూరు: శ్రావణ శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉపవాసాలతో తమ నివాస గృహాల్లో ప్రత్యేక అలంకరణతో చేసిన మందిరాల్లో లక్ష్మీదేవి అమ్మవారిని ఏర్పాటు చేసుకుని పూజలు నిర్వహించారు. కుంకుమార్చన, సహస్రనామార్చనలు, అష్టోత్తరాలు జరిపించారు. శ్రావణ శుక్రవారం రోజున అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తే అష్టైశ్వర్యాలు సమకూరుతాయని, ముత్తైదువులుగా పసుపుకుంకుమలతో దంపతులు సుఖసంతోషాలతో ఉంటారని భక్తుల ప్రగాఢవిశ్వాసం. స్థానిక వాసవీమాత, మహాలక్ష్మీదేవి, మండలంలోని వగ్గంపల్లె గంగాభవానీ మాత ఆలయాల్లో అర్చకులు రాయప్రోలు తులసీనాథ్, జె.వి.ఎస్.ప్రసాద్, రాఘవ సుమంత్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. యేల్చూరి బాలకొండలరావు, దరిశి మస్తాన్‌రావు, శేగు క్రిష్ణయ్య, భక్తులు పాల్గొన్నారు.

ఉలవపాడు: మండల కేంద్రమైన ఉలవపాడులో వరలక్ష్మీ వ్రతం పురస్కరించుకొని ఘనంగా పూజలు నిర్వహించారు. స్థానిక వేణుగోపాల స్వామి, కరేడు కాళహస్తీశ్వరస్వామి దేవస్థానాలు, రాజుపాలెం, ఉలవపాడులోని సాయిబాబా దేవాలయాల్లో మహిళా భక్తులు పూజలు ఆచరించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాల వితరణ జరిగింది.

సీఎస్‌పురం(పామూరు): శ్రావణ శుక్రవార వేడుకల ఘనంగా నిర్వహించుకున్నారు. అమ్మవారి ఆలయాల్లో స్వామివార్లకు విశిష్ట పూజలు నిర్వహించి తమ మొక్కులు తీర్చుకున్నారు. సీఎస్‌పురంలోని రాచూరి పెద్దమ్మ ఆలయంలో అమ్మవారు పార్వతీదేవిగా కొలువుదీరింది. స్థానిక కామాక్షీ సమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో కామాక్షీ అమ్మవారికి అర్చకులు విశిష్ట పూజలు నిర్వహించారు. దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అర్చకులు కె. శ్రీకృష్ణశర్మ, కేశవ, భక్తులు పాల్గొన్నారు.

పామూరు: మండలంలోని మోట్రావులపాడు గోశాలలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని గోపూజ నిర్వహించారు. ఈసందర్భంగా ఆవుకు వేడుకగా సీమంతం నిర్వహించారు. హిందువులు గోమాతను లక్ష్మీదేవిగా భావిస్తుండటంతో గోపూజలు నిర్వహించినట్లు గోశాల నిర్వాహకుడు మెడబలిమి వెంకట్రావు తెలిపారు.

కనిగిరి రూరల్: శ్రావణ మాసం పురస్కరించుకుని పట్టణంలోని పలు దేవాలయాల్లో శ్రావణ శుక్రవారం, వరలక్ష్మీ వ్రతం పూజలు అత్యంత భక్తి శ్రద్ధలతో జరిగాయి. స్థానిక షిరిడీ సాయిబాబా దేవస్థానంలో శ్రీ లక్ష్మీ దేవి అమ్మవారికి గణపతి పూజ, సామూహిక కుంకుమ పూజలు, పంచామృత అభిషేకాలు, శ్రీ లక్ష్మీ సహస్ర నామార్చాన విశిష్ట పూజ కార్యాక్రమాలు ఎంతో నియమ నిష్టలతో నిర్వహించారు. వేద పండితుల పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పూజలో కూర్చున్న మహిళలకు పసుపు కుంకుమలు, గాజులు, రవిక, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు దేవకి సుబ్రహ్మణ్యం, పెన్నా వెంకటేశ్వర్లు, ముచ్చర్ల ధర్మరావు, ఏసీ చెంచులు, వీసీ రామశాస్త్రి, మండ్లా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని దేవాంగ నగర్ వద్ద గల శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో శ్రావణ మాసం పురస్కరించుకుని వరలక్ష్మీ వ్రతం, విశిష్ట పూజ కార్యక్రమాలు జరిగాయి. ఆలయ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

వల్లూరమ్మ ఆలయంలో పూజలు

టంగుటూరు: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన వల్లూరమ్మ ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు నాగేశ్వరరావు, ఉప ప్రధాన అర్చకులు ఉమాశంకర్ భక్తులకు ఆశీర్వచనం అందజేశారు. వరలక్ష్మీ వ్రతం కావడంతో పెద్ద సంఖ్యలో మహిళలు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఈఓ రమేష్ భక్తులకు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఫ్రీ హోల్డ్ భూములపై సమగ్ర సర్వే



రికార్డులు పరిశీలిస్తున్న జేసీ గోపాల కృష్ణ

కనిగిరి రూరల్: ఫ్రీ హోల్డ్ అర్హత సాధించిన భూములపై సమగ్ర విచారణ, సర్వే నిర్వహిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ అన్నారు. మండలంలోని నందనమారెళ్ల, మాచవరం వద్ద అసైన్మెంట్ భూములను క్షేత్ర స్థాయిలో పరిశీలించి అనంతరం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో జరిగిన సమావేశంలో అధికారులతో శుక్రవారం మాట్లాడారు. కనిగిరిలో భూముల సవరణ చట్టాన్ని చూపుతూ ఫ్రీ హోల్డ్‌కు అర్హత లేని భూములకు కూడా జాబితాలో చేర్చారని, దీనిపై విచారణ సాగిస్తున్నట్లు చెప్పారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వానికి ఫిర్యాదులు వెళ్లడంతో కనిగిరి మండలాన్ని పైలెట్ మండలంగా తీసుకుని విచారణ సాగిస్తున్నట్లు వెల్లడించారు. మండలంలోని 40 రెవెన్యూ గ్రామాల్లో 13 ప్రత్యేక బృందాలుగా ఏర్పాటు చేసి భూముల దస్త్రాలను పరిశీలించామని.. క్షేత్ర స్థాయిలో విచారణ జరుగుతోందన్నారు. ఒక్కో బృందంలో డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐ, వీర్వో, సర్వేయర్‌లు ఉంటారని తెలిపారు. క్షేత్ర స్థాయిలో భూములను పరిశీలించి 22ఏ, బీ, సీ, డీ.. అసైన్డ్ ల్యాండ్, ఫ్రీ హోల్డ్ భూములు, చుక్కల భూములను పరిశీలించి పూర్తి స్థాయిలో నివేదికలు తయారు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీఓ పాలపర్తి జాన్ ఇర్విన్, జిల్లా రిజిస్ట్రార్ టి. ఉపేంద్ర రావు, కనిగిరి డివిజన్ పరిధిలోని రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

జంట గ్రామాల్లో డెంగీ బాధితులు

- స్పందించని అధికారులు

సింగరాయకొండ: మండలంలోని జంట గ్రామాలైన సింగరాయకొండ, మూలగుంటపాడులో ప్రజలు విష జ్వరాలతోపాటు డెంగీ బారిన పడి చికిత్స పొందుతున్నారు. సింగరాయకొండ మండల కేంద్రంలోని భైరాగిమాన్యంలో గల శివరాజ్ రైస్‌మిల్ వెనుక బజారులో నివసిస్తున్న షేక్ ఆశా(30) డెంగీ జ్వరంతో కందుకూరులోని కోటా రెడ్డి ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. మూలగుంటపాడు పంచాయతీ ఆఫీసు రోడ్డులో నివసిస్తున్న షేక్ నాయబ్‌రసూల్ కుమార్తె బుష్రా(12) ఈ నెల 9వ తేదీన డెంగీ జ్వరం బారిన పడి ఒంగోలులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందింది. ప్రస్తుతం చిన్నారి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా జంట గ్రామాల్లో దోమల బెడద అధికంగా ఉన్నా పంచాయతీ అధికారులు ఫాగింగ్ చేయకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వైద్య ఆరోగ్య సిబ్బంది ఫ్రైడే డ్రైడే పేరుతో ర్యాలీలు నిర్వహించారే తప్ప గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా ఉన్నా పట్టించుకున్న దాఖలాలు లేవని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా వైద్య ఆరోగ్య శాఖ, పంచాయతీ అధికారులు సంయుక్తంగా పారిశుధ్యం మెరుగుదలపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థులు సత్ప్రవర్తన కలిగి ఉండాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్సై శివబసవరాజు

మద్దిపూడి: కళాశాల విద్యార్థులు సత్ప్రవర్తన కలిగి ఉండాలని ఎస్సై శివబసవరాజు సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ర్యాగింగ్ వల్ల అనర్థాలు, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. కళాశాలలో బాలికలతో విద్యార్థులు సోదరభావంతో మెలగాలని, బాలికలను ర్యాగింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థులు కష్టపడి, ఇష్టంతో చదువుకున్నప్పుడే గమ్యాన్ని చేరుకోగలరన్నారు. చక్కగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఇటీవల కళాశాల ఆవరణంలో పలువురు మద్యం సేవించి, బాటిళ్లు పగలగొట్టడం లాంటి చర్యలకు పాల్పడుతున్నట్లు సమాచారం వచ్చిందని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారి సమాచారం పోలీసులకు అందించాలని కోరారు. ప్రిన్సిపాల్ అల్లూరయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

నాణ్యమైన పొగాకు బేళ్లకే అధిక ధర



టంగుటూరులో వేలం నిర్వహిస్తున్న శ్రీనివాసరావు

టంగుటూరు: రైతులు వేలం కేంద్రానికి నాణ్యమైన పొగాకు బేళ్లు తీసుకొచ్చి అత్యధిక ధర పొందాలని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు సూచించారు. స్థానిక పొగాకు వేలం కేంద్రానికి శుక్రవారం చిరుకూరపాడు, పంగులూరివారిపాలెం గ్రామాల రైతులు 1105 బేళ్లు తీసుకురాగా వాటిలో 1012 కొనుగోలయ్యాయి. గరిష్ఠ ధర రూ.359, కనిష్ఠ ధర రూ.205, సరాసరి ధర రూ.326.15 పలికింది. వేలంలో మొత్తం 45 మంది వ్యాపారులు పాల్గొన్నారని నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

కొండపిలో సరాసరి ధర రూ.303.97

కొండపి(సింగరాయకొండ): కొండపి వేలం కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన వేలంలో సరాసరి ధర కేజీ రూ.303.97 పలికిందని నిర్వహణాధికారి జి.సునీల్ కుమార్ తెలిపారు. ఎన్.ఎన్.కండ్రిక, పెట్లూరు, వర్ధినేనివారిపాలెం, జగ్గరాజుపాలెం రైతులు 1081 బేళ్లు వేలానికి తీసుకురాగా 965 కొనుగోలయ్యాయి. గరిష్ఠ ధర రూ 358, కనిష్ఠ ధర రూ.204 పలికింది. వేలంలో 17 మంది వ్యాపారులు పాల్గొన్నారు.

గేటు వద్ద కంకర.. అధికారులు కానరా?



పాకల గేటు వద్ద రహదారిపై కంకర

సింగరాయకొండ: పాకల రైల్వే గేటు వద్ద ట్రాక్ పనులు సక్రమంగా చేయకపోవడంతో మొనదేలిన కంకర రాళ్లు రోడ్డుపైనే ఉన్నాయి. గేటు దాటాలంటే వాహనదారులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. సుమారు 15 రోజుల క్రితం పాకల గేటు వద్ద రైల్వే ట్రాక్ మరమ్మతులు చేశారు. కానీ రోడ్డుపై ఉన్న కంకర రాళ్లు తొలగించలేదు. రైల్వే అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలనిప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

వాహన అతిక్రమిస్తే చర్యలు

- ఏఎంవీఐ జయప్రకాష్ హెచ్చరిక



సరైన పత్రాలు లేని వాహనానికి జరిమానా విధిస్తున్న ఏఎంవీఐ జయప్రకాష్

కొండపి(సింగరాయకొండ): వాహనదారులు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్థానిక అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ జయప్రకాష్ హెచ్చరించారు. శుక్రవారం టంగుటూరు సమీపంలో వాహనాల తనిఖీ చేపట్టారు. సరైన పత్రాలు లేని వాహనాలు, ఓవర్ లోడ్‌తో వెళ్తున్న లారీలు, లైసెన్స్ లేని కాలేజీ బస్సు, స్కూల్ బస్సుల డ్రైవర్లు, గూడ్స్ వాహనాల్లో కూలీలను తరలిస్తున్న ఆటోలకు జరిమానా విధించారు. ప్రతి స్కూల్ బస్సులో హెల్పర్ తప్పనిసరిగా ఉండాలని, లేదంటే ఎవరైనా సరే ఫొటో తీసి 9154294733కు వాట్సాప్‌లో పంపితే తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

రెండు రేషన్ దుకాలపై 6ఏ కేసులు నమోదు



రేషన్ షాపులను తనిఖీ చేస్తున్న అధికారులు

టంగుటూరు: స్థానిక చెల్లెమ్మతోట రాములవారి బజారులో ఉన్న 3, 9వ నంబర్ రేషన్ షాపులపై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం దాడి చేశారు. రెండు షాపులపై 6ఏ కేసులు నమోదు చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ సీహెచ్ కృష్ణమోహన్ పేర్కొన్నారు. 3.5 క్వింటాల రేషన్ బియ్యం తూకంలో తేడాలు వచ్చాయని, అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. దాడుల భయంలో పలువురు డీలర్లు తమ దుకాణాలకు తాళం వేసి వెళ్లిపోయారు. తనిఖీలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆర్వీఎస్ కృష్ణ మోహన్, కె.డేవిడ్, ఎస్.రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కనిగిరిలో మత్స్య శాఖ ఉందా?



మత్స్య శాఖ కార్యాలయం

- పంద్రా ఆగస్టున జాతీయ జెండాను సైతం ఆవిష్కరించని అధికారులు

కనిగిరి రూరల్: మత్స్యకారులకు అందుబాటులో ఉండాల్సిన మత్స్య శాఖ అధికారులు కనిగిరిలో ఆచూకీ లేకుండా పోయారు. స్థానిక ఎంపీడీఓ ఆఫీసు సమీపంలో ఓ అద్దె భవనంలో మత్స్య శాఖ కార్యాలయ ఉన్నప్పటికీ అధికారులు వచ్చిన దాఖలాలు లేవు. కనీసం కార్యాలయం తలుపులు కూడా తెరుచుకోవు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో సుమారు 10 సొసైటీల ద్వారా 10 వరకు చెరువుల్లో (మోపాడు రిజర్వాయర్, పునుగోడు రిజర్వాయర్, ఎన్‌గొల్లపల్లి రిజర్వాయర్, నర్సమాంబపురం, కండ్రిక తదితర పెద్ద చెరువు) చేపల పిల్లల పెంపకం చేస్తారు. ఇవి కాక పంచాయతీల పర్యవేక్షణలో ఉండే చెరువుల్లో కూడా చేపల పిల్లల వదులుతారు. అయితే వీటికి ప్రతి ఏడాది జూన్ ఆఖరునా ఫసలికి నిర్ణయించి, సొసైటీల ద్వారా చేపల పెంపకానికి అనుమతి ఇస్తారు. అయితే ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందు వల్ల ఆయా చెరువుల్లో ఇప్పటికే కొందరు చేప పిల్లలను వదలగా మరి కొందరు చేప పిల్లలను వదిలేందుకు సిద్ధంగా ఉన్నారు. అయితే చేపల పెంపకం రైతులకు, మత్స్యకారులకు, సొసైటీ సభ్యులకు ఎటు వంటి సందేహం వచ్చినా.. ఫోన్‌లో సంప్రదించాల్సిందే తప్ప.. అధికారులు మత్స్య కార రైతులతో, మత్స్యకార కుటుంబాలతో మట్లాడిన దాఖలు లేవు. కనీసం మత్స్య కారులతో సమావేశాలు పెట్టిన పరిస్థితి లేదంటే అతిశ యోక్తి కాదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మత్స్య కారులకు అనేక పథకాలను అందచేశారు. వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు, వ్యాపార పరంగా ప్రోత్సాహం కల్పించేందుకు సుమారు 60 శాతం సబ్సిడీపై వాహనాలను కూడా ఇచ్చారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో అవి అమలు అవుతున్నాయా లేదా.. అసలు ఆ పథకాలు ఉన్నాయా లేదా అనేది కూడా మత్స్యకారులకు తెలియని పరిస్థితి నెలకొంది. కనిగిరికి ఒక ఇన్‌చార్జి లైన్ ఇన్‌స్పెక్టర్, ఒక ఫీల్డ్ మేన్ ఉన్నట్లు నివేదికలున్నాయి. అసలు వారు ఉన్నారో లేదో అర్థం కాని పరిస్థితి. గురువారం స్వాతంత్ర్య దినోత్సవం రోజున ఆశాఖ అధికారులు కనిగిరి కార్యాలయం వద్ద జాతీయ పతాకావిష్కరణనే చేయలేదంట పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు



ట్రాక్టర్ల యజమానులతో మాట్లాడుతున్న సీఐ హజరత్తయ్య

జరుగుమల్లి(సింగరాయకొండ): ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే సహించేది లేదని, ట్రాక్టర్ల యజమానులపై కఠిన చర్యలు తప్పవని సీఐ సీహెచ్ హజరత్తయ్య హెచ్చరించారు. జరుగుమల్లి పోలీస్‌స్టేషన్‌కు శుక్రవారం సాయంత్రం ఇసుక ట్రాక్టర్ల యజమానులను పిలిపించి మాట్లాడారు. ఇసుక అక్రమ రవాణాకు స్వస్తి పలకాలని, రాత్రి వేళ అక్రమంగా తరలిస్తే లాఠీలకు పనిచెప్పాల్సి వస్తుందని ఘాటుగా హెచ్చరించారు. తహసీల్దార్, ఎంపీడీఓ నుంచి అనుమతి తీసుకుని ఇసుక రవాణా చేయాలే తప్ప ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టవద్దని చెప్పారు. ఎస్సై వి.వెంకటేశ్వరరావు, ఇసుక ట్రాక్టర్ల యజమానులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు గుర్తింపు



మంత్రి నుంచి ప్రశంస పత్రాన్ని అందుకుంటున్న కానిస్టేబుల్ రవి, హెడ్ కానిస్టేబుల్ రమేష్ ,ఉపాధ్యాయుడు చక్రపాణి



మంత్రి, కలెక్టర్ చేతుల మీదుగా పశంసాపత్రం అందుకుంటున్న సీఎస్‌పురం ఈసీ జి.రతన్ బాబు,హనుమంతునిపాడు డీటీ కిషోర్‌రెడ్డి ,డేటా ఎంట్రీ ఆపరేషర్ రసూల్



విద్యుత్‌శాఖ ఎస్ఈ చేతులమీదుగా పశంసాపత్రం, అవార్డు అందుకుంటన్న లైన్‌మన్ జీడీ కరుణాకర్

కొండపి(సింగరాయకొండ)/టంగుటూరు: విధి నిర్వహణలో ప్రతిభ చూపిన అధికారులు ప్రశంసలు దక్కాయి. ఒంగోలులోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన స్వాతంత్ర్య వేడుకల్లో రాష్ట్ర మంత్రి డీబీవీ స్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్పీ ఏ ఆర్ దామోదర్ చేతుల మీదుగా కొండపి కానిస్టేబుల్, మద్దిపూడి రవి, హెడ్ కానిస్టేబుల్ బచ్చల రమేష్, ఎలక్షన్ ఎస్ఏ హనుమంతరావు, టంగుటూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కెమిస్ట్రీ ఉపాధ్యాయుడు తొట్టెంపూడి చక్రపాణి ప్రశంస పత్రాలు అందుకున్నారు. వీరిని ఉన్నతాధికారులతోపాటు సహచర ఉద్యోగులు అభినందించారు.